36

# భ్రమణం - పరిభ్రమణం

సన్నగా తుప్పర ప్రారంభమయింది. అంతదాకా మైదానంలో ఉన్న పిల్లలందరూ 'హాయ్'మంటూ చెదిరిపోయారు. జాఫర్ ఓసారి ఆకాశంకేసి చూసి నిట్టూర్చాడు. కారుమబ్బులు కమ్ముకొని ముంచుకొస్తున్నాయి. చూస్తూ చూస్తూ ఉండగానే చినుకులు పెద్దవైనాయి. జాఫర్ ఇక చేసేదేంలేదు కనక, ఓ చూరుకిందచేరాడు.

"ఈ వర్షాకాలం అంతా ఇంతే నండీ! మాగ్గిరాకీ సరిగ్గా ఉండి చావదు" అన్నాడు జాఫర్. చినుకులు మరీ పెద్దవి కావడంతో చూరుకిందినించి వరండాలో కొచ్చాడు. జాఫర్ నెత్తిమీద పడిన వర్షపు నీటిని జేబురుమాలతో తుడుచుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు. మెల్లగా తన గోడును ప్రారంభించాడు.

"నా చదువుకి, నేను చేసే పనికి సంబంధం లేదండి!" అంటూ ప్రారంభించాడు జాఫర్. 'నేను బి.కాం. చదువుతున్నాను. ఇంకో ఏడాది చదివినట్లయితే గ్రాడ్యుయేట్ నయ్యేవాణ్ని, కానీ ఈ లోగానే మా కర్మ కాలిపోయింది. మా నాన్న హఠాత్తుగా చనిపోయాడు. ఇంటికి నేనే పెద్ద. నా తరువాత ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్లు వున్నారు. మా ఆఖరి చెల్లికి పోలియో కారణంగా కాళ్ళు పడిపోయాయి.

జాఫర్ తండ్రి వస్తాదు. చాలా కుస్తీపోటీల్లో పాల్గొన్నాడు. ఏవో మెడల్సులూ అవీ కూడా సంపాదించాడు. కర్రసాములోనూ, బస్కీలు తీయడంలోనూ ఆరితేరాడు. కుస్తీపోటీల మీద మోజు తగ్గాక వడ్డీ వ్యాపారం చేసే మార్వాడీల వద్ద 'దాదా'గా పనిచేశాడు. రోజంతా ఊరిమీద తిరగడం, వడ్డీలు, వాయిదాలు వసూలు చేయటం అతని పని. నెల జీతంకాక, చేసిన వసూళ్ళను బట్టి కొంత కమిషన్ కూడా అతనికిస్తుండేవాళ్ళు.

"జీతమన్నమాటేగానీ, చాలా తక్కువండీ! అది వారం పదిరోజులక్కూడా సరిపోదు. మిగిలిన రోజులు గడవాలంటే, కమిషన్ బాగా రావాలి. కమిషన్ బాగా రావాలంటే ఎక్కువ వసూళ్ళు చేయాలి. అందుకోసం యమతిరుగుడు తిరగాలి. అవతలి వాళ్ళు బాకీ తీర్చగలిగిన స్థితిలో ఉన్నా లేకపోయినా, అదిరించో, బెదిరించో వసూలు చేయాలి. మా నాన్న అలా వసూలు చేసేవాడండీ! ఒక్కోసారి చెంబూ, గిన్నె, కంచం, మంచం పట్టుకొచ్చేవాడు. చాలాసార్లు కొట్టి కూడా వసూలు చేసేవాడు" అన్నాడు జాఫర్.

ఈ ఉద్యోగంలో 'సలీందాదా' దాదాపుగా పది సంవత్సరాలు పనిచేశాడు. ఈ పదేళ్ళలో అతని జీతంలోగానీ, కమిషన్లోగానీ పెద్ద పెరుగుదల ఏమీ లేదుగానీ, సంసారం మాత్రం బాగా పెరిగింది.

ఆదాయం చాలదు. ఖర్చు పెరిగింది. చూస్తూ చూస్తూ పిల్లల్నీ పస్తులుంచలేకపోయేవాడు సలీందాదా. అందుకని వసూళ్ళనించి కొంత వాడుకునేవాడు. సేట్‌లు అడిగినప్పుడు వసూలు కాలేదనేవాడు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇంకో తప్పు, మరో తప్పు చేయడం - వాటిని మాఫీ చేసుకోవడంకోసం అభూతకల్పనలనల్లి చెప్పడం సలీం దాదాకు మామూలయింది.

ఆవలించకపోయినా పేగులు లెక్కపెట్టగల సేట్‌లు కొద్ది రోజుల్లోనే జరుగుతున్న మోసాన్ని కనుక్కున్నారు. సలీందాదాను నిలదీసి అడిగారు. అతగాడు కాదుకూడదని బుకాయించినా లాభం

లేకపోయింది. ముగ్గురు గుండాలకు తాగబోయించి, సలీం దాదాను కుమల బొడిపించారు సేట్‌లు.

"అలా జరగడం మంచిదయిందండీ! సేట్‌లు మెహర్బానీకోసమనండి, పొట్ట జరక్కనే అనండి, మా నాన్న చాలా మంది ఉసురుపోసుకున్నాడు. ఆ పాపం ఊరికే పోతుందా మరి?" అన్నాడు జాఫర్.

సలీందాదా కోలుకొనడానికి రెండు వారాలు పట్టింది. ఆ తరువాత నెల రోజులకే 'సుమాయిష్' ప్రారంభమయింది. ఆ ఎగ్జిబిషనులో రంగులరాట్నం తిప్పడానికి రోజుకు ఐదు రూపాయల కూలీకి కుదిరాడు సలీం దాదా.

"నెల తరువాత ఆ పని పోయింది. కానీ  మా నాన్న మాత్రం ఈ వృత్తిని వొదల్లేదు. రంగులరాట్నంతో బాటు ఊరూరా తిరిగాడు. అలా తిరుగుతూ తిరుగుతూ కూడబెట్టిన డబ్బుతో ఈ రాట్నం కొన్నాడు. ఆ ఉద్యోగం మానేసి, సొంతగా నడుపుకోవడం ప్రారంభించాడు" అన్నాడు జాఫర్.

గడచిన పది సంవత్సరాలుగా సలీందాదా తెలుగు దేశమంతా తిరిగాడు. ఇప్పుడు మూడు రంగుల రాట్నాలున్నాయి. ఒకటి మరీ చిన్న పిల్లల్ని కూచోబెట్టి తిప్పేది. మరొకటి కొయ్యగుర్రాలు తగిలించి తిప్పేది.మూడవది నిలువుగా తిప్పే చక్రంలాంటిది.

"తక్కువలో తక్కువ ఐదు పైసలు. ఒక్కో ట్రిప్పుకు 60, 70 పైసలు గిడుతుంది. తిరిగే పిల్లలుంటే రోజుకు వంద, రెండువందల ట్రిప్పులయినా వేయొచ్చు. కానీ పండగలకూ, జాతర్లకూ తిరనాళ్ళకూ తప్ప - అంత బిజినెస్ ఉండదు. ఒక్కోసారి మూడింటికీ రష్ ఉంటుంది. అందుకని ఇద్దరు కూలిమనుషుల్ని పెట్టుకున్నా. రోజుకు ఒక్కోడికి పదేసి రూపాయలిస్తా. ఏడుగంటల కొస్తారు. ఎనిమిది కల్లా పిల్లలు బడిలోకెడతారు. మళ్ళీ మధ్యాహ్నం కాస్సేపు గిరాకీ, సాయంకాలం - బాగా ఉంటుందండీ! అప్పుడే కాస్త ఎక్కువ వసూళ్ళుంటాయి" అన్నాడు జాఫర్.

జంటనగరాల్లో ఇలాంటి వాళ్ళు పాతికమంది దాకా ఉన్నారని, వీరందరూ కూడపలుక్కుని వొకరి ఏరియాకి మరొకరు పోకుండా సర్దుకుంటుంటారని జాఫర్ అన్నారు.

"నా దగ్గరున్నవి పాతవండీ! కొత్తగా చేయించాలంటే, రెండు వేలనుండి, నాలుగు వేలదాకా అవుతుంది... అవునండీ బాల్ బేరింగ్‌ల మీదనే తిరుగుతాయి. వచ్చిందంతా మిగిలితే ఇంకేం సార్! పోలీసులు మా ప్రాణాలు తీస్తుంటారు. 'రోజుకింత' అని వారి ముఖాన పడేస్తా. మున్సిపాలిటీ స్థలాల్లో వేసినందుకు వాళ్ళూ మమ్మల్ని చంపుకుతింటుంటారు. ఇంతపడేసి వాళ్ళనోర్లు మూయిస్తా. అన్ని ఖర్చులు పోను, రోజుకు 20, 30 దాకా మిగుల్తాయండీ!" అన్నాడు జాఫర్.

తనకీపనే బాగా వుందన్నాడు. ఉద్యోగం వస్తుందనే ఆశ తనకు లేదని, వొకవేళ వచ్చినా తను చేయడానికి సిద్ధంగా లేనని అన్నాడు.

"ఇంకా గిరాకీ పెరగాలండీ! పెరగాలంలే జనాన్ని పోగెయ్యాలి. నేనో టేప్ రికార్డరూ, రికార్డు ప్లేయరూ కొందామనుకుంటున్నా, నా తమ్ముళ్ళ చేత - చాక్లెట్లు, బిస్కెట్లు అమ్మించు దామనుకుంటున్నా... లేదండీ! ఇక నేను చదవను. ఇంతవరకూ చదివిందే నాకు పనికిరానప్పుడు ఇంకో ఏడాది ఈ ముష్టి చదువుకోసం నేను వృధా చేయనండీ!" అన్నాడు జాఫర్.

మన విద్యావిధానం మీద ఇంతకన్నా వ్యాఖ్యానం లేదేమో!